సిద్దిపేట
నమస్తే తెలంగాణ
గురువారం 15 మే 2025
THURSDAY, MAY 15, 2025

## ఆలయానికి హరీశ్‌రావు గ్రానైట్ విరాళం



ఆలయానికి చేరిన గ్రానైట్ వద్ద గ్రామ నాయకులు

సిద్దిపేట,మే14: సిద్దిపేట పట్టణం లింగారెడ్డిపల్లి ఒకటో వార్డు పరిధిలో నిర్మిస్తున్న వనదుర్గా అమ్మవారి దేవాలయానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు గ్రానైట్‌ను విరాళంగా అందజేశారు. గ్రామంలో దేవాలయాన్ని నిర్మించామని, మీ వంతు సహాయం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు హరీశ్‌రావును కలిసి కోరగా దేవాలయానికి అవసరమయ్యే లక్ష విలువగల గ్రానైట్‌ను ఆలయ నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా దేవాలయానికి గ్రానైట్ అందజేసిన హరీశ్‌రావుకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

## రేణుకాఎల్లమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి, ఏసీపీ





హుస్నాబాద్‌లోని రేణుకాఎల్లమ్మసన్నిధిలో పూజలు చేస్తున్న జిల్లా జడ్జి రమాదేవి, ఏసీపీ సదానందం

హుస్నాబాద్‌టౌన్, మే 14: హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ తల్లిని జిల్లా జడ్జి కె.సాయిరమాదేవి, హుస్నాబాద్ ఏసీపీ సదానందం బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వారిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఎస్సై తోట మహేశ్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పచ్చిమట్ల రాధ, పూదరి శ్రీనివాస్, ముప్పిడి రాజిరెడ్డి, పేరుమాండ్ల నర్సాగౌడ్, గాజుల భగవాన్, శరబంధం పాల్గొన్నారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

సిద్దిపేట,మే14: లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు అర్హులైన వారు ఈ నెల 17వతేదీలోగా దరఖాస్తు చేసుకువాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 5000 మంది లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు మీ సేవ కేంద్రాల్లో లైసెన్స్ సర్వే శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తు చేయవచ్చని, ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాల్లో మే 26 నుంచి జూలై 26వ తేదీ వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియెట్ (గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండాలి ) కనీసం 60శాతం మార్కులు లేదా ఐటీఐ డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) లేదా డిప్లొమా (సివిల్) లేదా బీటెక్ (సివిల్) లేదా ఇతర సమానమైన అర్హత ఉన్నవారు ప్రాస్పెక్టస్‌ను మీ సేవా కేంద్రాల ద్వారా మాత్రమే రూ. 100 చెల్లించి పొందాలన్నారు. ఈ నెల 17వతేదీలోగా ఓసీ అభ్యర్థులు రూ.10,000, బీసీ అభ్యర్థులు రూ.5,000 ,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు రూ.2,500 చెల్లించి మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ : 9849081489, 7032634404, 9441947339 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## హనుమాన్ దీక్ష విశ్వవాప్తమైంది



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల శ్రీనివాస్

సిద్దిపేట టౌన్,మే 14 : సిద్దిపేటలో నలుగురు..విజయవాడలో ఇద్దరితో ప్రారంభమైన హనుమాన్ మాలధారణ దీక్ష విశ్వవాప్తమైందంటే పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామి దీక్ష ఫలితమేనని రామరాజు రాగిచెట్టు హనుమాన్ ఆలయ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 16 ఏండ్లుగా దేవాలయంలో మాలధారణ స్వాములకు అన్నప్రసాదం అందిస్తున్నామని చెప్పారు.విజయవాడలో నిర్వహించే హనుమాన్ తెప్పోత్సవాన్ని సైతం వైభవంగా సిద్దిపేటలో జరుపుతున్నామని వివరించారు. అందులో భాగంగా గురువారం సాయంత్రం రాగిచెట్టు హనుమాన్ ఆలయం నుంచి హనుమాన్ స్వాములు,భక్తులతో శోభాయాత్రగా బయలుదేరి కోమటిచెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు.అఖిల భారత హనుమాన్ పీఠాధిపతి చేతుల మీదుగా జరిగే తెప్పోత్సవంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొంటారన్నారు. కృష్ణమాచార్య, కైలాసం, పరమేశ్వర్, శ్రీనివాస్, రమేశ్, మధుసూదన్, సుభాష్ పాల్గొన్నారు.

### వైభవంగా రథోత్సవం



వరదరాజుల స్వామి రథాన్ని లాగుతున్న హనుమాన్ భక్తులు

మర్కూక్,మే14: మండలంలోని వరదరాజ్‌పూర్‌లోని భూనీల వరదరాజస్వామి జాతర ఘనంగా జరిగింది. బుధవారం వరదరాజుల స్వామి రథోత్సవం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక హోమం, పూర్ణాహుతి,దిష్టి కుంభం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, భట్టు అంజిరెడ్డి,పాండుగౌడ్, రామచంద్రం హాజరయ్యారు. బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య దేవాలయం అభివృద్ధికి రూ.10వేలు అందజేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న నూనె కుమార్‌యాదవ్

కొండపాక(కుకునూరుపల్లి), మే 14 : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం కొండపాక మండలంలోని దుద్దెడకు చెందిన ఆత్కూరి సుధాకర్‌కు రూ.42వేలు, దయ్యాల అండాలుకు రూ.17,500, జక్కుల లక్ష్మికి రూ.24వేలు, ఇద్దుమ్ కరుణాకర్‌కు రూ.24,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చిలుముల రామ్మోహన్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిక్కుడు భాను, కెమ్మెసారం శ్యామ్, ఎండీ.ముగ్దుమ్, జక్కుల రాకేశ్‌యాదవ్, దయ్యాల నవీన్ పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి



దుబ్బతండాజీపీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీవో వెంకటేశ్వర్లు

మద్దూరు(ధూళిమిట్ట), మే14: గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ధూళిమిట్ట మండల పంచాయతీ అధికారి(ఎంపీవో) వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండలంలోని దుబ్బతండా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని హరిత నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. జూన్‌లో చేపట్టనున్న వనమహోత్సవానికి నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండి సమస్యలపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మాధవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



మర్కూక్ సంకట విమోచన హనుమాన్ ఆలయంలో మాలధారులు

మర్కూక్,మే14: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సంకట విమోచన దేవాలయ చైర్మన్ సాయిని మహేశ్ పేర్కొన్నారు. బుధవారం ఆలయంలో నూతనంగా 51మంది హనుమాన్ మాలధారులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

# పడకేసిన పారిశుధ్యం



నారాయణరావుపేటలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం



నారాయణరావుపేటలో అపరిశుభ్రంగా మురుగు కాల్వ

- నారాయణరావుపేటలో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం
- కంపు కొడుతున్న పరిసరాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

నారాయణరావుపేట, మే14: మండల కేంద్రమైన నారాయణరావుపేటలో పారిశుధ్యం పడకేసింది. ప్రత్యేకాధికారుల పాలనలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఒకటో వార్డు, రెండో వార్డులో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలోని వీధులు ఎటు చూసినా అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య సిబ్బంది మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదు. దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో అధికారుల చిత్తశుద్ధి కరువైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రోడ్డుపైన, ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు పేరుకుపోయాయి. పరిసరాలు కంపు కొడుతుండటంతో ఈగలు, దోమలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. దీంతో పరిసరాలు రోగాలకు నిలయంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## శుభకార్యాలకు హాజరైన ఎమ్మెల్యే పల్లా



చేర్యాలలో బీఆర్ఎస్ నాయకుడి కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా



కొమురవెల్లిలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి, మే 14 : మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు కాపర్తి మల్లికార్జున్ కూతురు మాధురి వివాహం బుధవారం ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ వివాహానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏర్పుల మహేశ్ ఇంటి వద్ద జరిగిన ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

**వేడుకకు హాజరైన ఎమ్మెల్యే పల్లా**

చేర్యాల, మే 14 : మండలంలోని కొత్త దొమ్మాట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తాండ్ర లక్ష్మయ్య కుమార్తె శోభారాణి వివాహం మహేంద్రతో పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగింది.బీఆర్ఎస్ నాయకుడి కుమార్తె పెండ్లికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం



హుస్నాబాద్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రవీణ్ తదితరులు

హుస్నాబాద్‌టౌన్, మే 14: 'కురిసిన వాన తడిసిన ధాన్యం' రైతుల సమస్యలపై నమస్తేతెలంగాణ దినపత్రికలో బుధవారం వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన వరిధాన్యాన్ని పౌరసరఫరాలశాఖ డీఎం ప్రవీణ్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. రైతులు పండించిన చివరి గింజవరకూ తాము కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని డీఎం చెప్పారు. కార్యక్రమంలో డీసీవో నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ ఆలయంలో 'ఎర్రోళ్ల' పూజలు



కొమురవెల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

చేర్యాల, మే 14 : కొమురవెల్లిలో బీఆర్ఎస్వీ నాయకుడు ఏర్పుల మహేశ్ కుటుంబాల ఆధ్వర్యంలో నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పుల మహేశ్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు శాలువాలు కప్పి సన్మానించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్, బీఆర్ఎస్ చేర్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, చేర్యాల టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, సెక్రటరీ బూరగోని తిరుపతిగౌడ్, మహిళా నాయకురాలు పచ్చిమడ్ల మానస, నాయకుడు చేతిరెడ్డి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ప్రజాప్రతినిధులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి,వెంకటయ్య,యాదవరెడ్డి

గజ్వేల్/ రాయపోల్,మే 14 : దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లికి చెందిన బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్ అన్న కుమారుడు అజయ్ వివాహం బుధవారం గజ్వేల్‌లోని శోభగార్డెన్‌లో జరిగింది. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్,నియోజకవర్గ సీనియర్ నాయకుడు మనోహరావు నూతన వధూవరులను ఆశీర్వదించారు. దుబ్బాక,గజ్వేల్ నియోజకవర్గాలకు చెందిన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

**జిల్లా రవాణా శాఖ అధికారి క్రిష్టోఫర్**

సిద్దిపేట టౌన్,మే 14 : స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్‌టెస్ట్ విధిగా చేయించాలని జిల్లా రవాణాశాఖ అధికారి క్రిష్టోఫర్ సూచించారు. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ సమయం ఆసన్నమైన నేపథ్యంలో బుధవారం రవాణా శాఖ కార్యాలయంలో బస్సుల యజమానులు, పాఠశాల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 15 నుంచి 30 వరకు జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పదిహేనేళ్లు దాటిన స్కూల్ బస్సులను విక్రయించుకోవడం లేదా స్క్రాప్ చేయాలని..అలాకాదని నడిపితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. బస్సుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. బస్సులు నడిపే డ్రైవర్లు అన్ని రకాల పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. ఫిట్‌నెస్ చేయించకుండా బస్సు రోడ్డు ఎక్కితే సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.



నిబంధలనపై అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారి క్రిష్టోఫర్

## మహిళల రక్షణకు ప్రాధాన్యం



కడవేర్గులో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చేర్యాల, మే 14 : మహిళల రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని చేర్యాల ప్రొబిషనరీ ఎస్సై సమత అన్నారు.మండలంలోని కడవేర్గులో ఉపాధిహామీ పథకంలో భాగంగా పని చేస్తున్న కూలీలకు బుధవారం చేర్యాల ప్రొబిషనరీ ఎస్సై, హుస్నాబాద్ షీటీమ్ బృందం ఆధ్వర్యంలో మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా, అపరిచిత వ్యక్తుల గురించి, సామాజికరుగ్మతలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మాయమాటలు చెబితే నమ్మవద్దన్నారు. తక్కువ డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయని మోసం చేస్తారని, వాటికి దూరంగా ఉండాలన్నారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురిచేసినా, అవహేళనగా మాట్లాడినా వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. షీటీమ్ బృందం హెచ్‌సీ సదయ్య, మహిళా పీసీలు, ప్రశాంతి, స్వప్న, పీసీ కృష్ణ పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలోని గంగరేగు చెట్టు ఆవరణలో ఏసీపీ సందానందం

చేర్యాల, మే 14 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం హుస్నాబాద్ ఏసీపీ ఎస్.సదానందం పర్యటించారు.ఇటీవల హుస్నాబాద్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో ఆయన పర్యటించడంతో పాటు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.అనంతరం చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజుతో కలిసి ఆలయ ఆవరణ, గంగరేగుచెట్టు, శీఘ్రదర్శనం, సాధారణ దర్శనం, స్పెషల్ దర్శనం తదితర ప్రాంతాలను పరిశీలించారు. దేవుడి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, టెంపుల్ చుట్టూ సీసీ కెమెరాలు పని చేసేవిధంగా ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు.జేబు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏసీపీ సూచించారు.అనంతరం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఎక్కువగా నమోదవుతున్న కేసులపై ఆరా తీశారు. ఫిర్యాదుదారుల పట్ల ప్రతి ఒక్కరూ మర్యాదగా వ్యవహరించాలని, ఫిర్యాదు వచ్చిన వెంటనే విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గుర్జకుంట శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు.చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆయన ఆదేశించారు.

**శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలి**

మద్దూరు(ధూళిమిట్ట), మే14: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలని హుస్నాబాద్ ఏసీపీ ఎస్ సదానందం అన్నారు. బుధవారం మద్దూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించగా చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ పూల మొక్క అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అవినీతికి తావులేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఏఎస్సై సదాశివరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు. అనంతరం ఏసీపీ సదానందాన్ని జయశంకర్ సేవా సమితి వ్యవస్థాపకుడు సతీశ్‌కుమార్ శాలువాతో సన్మానించారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి




చేర్యాలలో సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



మద్దూరులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), మే14: కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ కోరారు. బుధవారం మద్దూరులో హమాలీ కార్మికులతో కలిసి సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి, సీఐటీయూ మండల కన్వీనర్, సీపీఎం మండల కార్యదర్శి ఎండీ షఫిక్, నాయకులు రమేశ్, పిట్టల నరేశ్, గాజుల సురేశ్, రమేశ్, చందు పాల్గొన్నారు.

**సమ్మె వాల్‌పోస్టర్ విడుదల**

చేర్యాల, మే 14 : కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్ మావో కోరారు.కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల 20దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాలు మద్దతు ఇవ్వాలని కోరుతూ సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయం ఎదుట ఆయన ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ విధానాలను రద్దు చేయాలన్నారు.కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బండకింది అరుణ్‌కుమార్, రాళ్లబండి నాగరాజు, పోలోజు శ్రీహరి, ఆముదాల నర్సిరెడ్డి, బోయిని మల్లేశం, గొర్రె శ్రీనివాస్, ఇప్పకాయల శోభ, ఎండీ ఎజాస్, దండమైన భాస్కర్, కనకయ్య తదితరుపాల్గొన్నారు.

## ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

సిద్దిపేట టౌన్,మే 14 : సిద్దిపేట ఉమాపార్థివ కోటిలింగాల ఆలయ నూతన కార్యవర్గాన్ని ఆరుగురు సభ్యులతో బుధవారం ఎన్నుకున్నారు. ఆలయ నూతన డైరెక్టర్లుగా యాదగిరి, శ్రీనివాస్, ఎల్లయ్య, మాధవి, భూమేశ్, అనుష నియమితులయ్యారు. ఈ మేరకు దేవాలయ అనువంశిక చైర్మన్, ధర్మకర్త తడ్కమడ్ల ఈశ్వరయ్య సమక్షంలో కార్యవర్గ సభ్యులు స్వామి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు.

### పరిస్థితి విషమించి మహిళ మృతి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), మే 14 : పరిస్థితి విషమించి మహిళ మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతే గ్రామంలో చోటు చేసుకుంది. భూంపల్లి ఎస్సై వి.హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన నర్మెట కలవ్వ (52) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నది. కలవ్వ కీళ్ల నొప్పులు, ఆస్తమా, గుండె జబ్బుతో బాధ పడుతున్నది. ఈ నెల 12న రాత్రి ఆమె గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల13వ తేదీన మృతి చెందింది. మృతురాలి భర్త రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

### రేపు అండర్- 25 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

సిద్దిపేట,మే14: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్- 25 జిల్లా జట్టు ఎంపిక శుక్రవారం జరగనుందని సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కలకుంట్ల మల్లిఖార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేటలోని జయశంకర్ క్రికెట్ స్టేడియంలోజిల్లా జట్టు ఎంపిక ఉంటుందని, ఈ అవకాశాన్ని జిల్లా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జట్టు ఎంపిక ఉదయం తొమ్మిది గంటల నుంచి స్టేడియంలో ప్రారంభం కానుందని, ఆగస్టు 31, 2000 సంవత్సరం తర్వాత జన్మించిన వారు జట్టు ఎంపికకు అర్హులన్నారు. యూనిఫామ్, క్రికెట్ కిట్స్, ఇతర క్రీడాసామగ్రితో హాజరుకావాలని ఆయన కోరారు.

### నిరుపేద వధువుకు పుస్తెమట్టెలు అందజేత



రాయపోల్, మే 14: మండలంలోని మంతూర్ గ్రామానికి చెందిన తాళ్ల బాలయ్య, పద్మ రెండో కూతురు అనూష పెండ్లికి అదే గ్రామ సీనియర్ నాయకుడు పాల రామగౌడ్ బుధవారం పుస్తె మట్టెలు అందజేశారు.గ్రామంలో ఇప్పటికే నలుగురు నిరుపేద వధువులకు ఆయన పుస్తె మట్టెలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

**ఆర్థికసాయం అందజేత**



మద్దూరు(ధూళిమిట్ట), మే14: మద్దూరు మండలం సలాఖపూర్ గ్రామానికి చెందిన ఎర్ర విజయ కూతురు అర్చన వివాహానికి బుధవారం తెలంగాణ జాగృతి మండల మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ మండల నాయకుడు గడిపె అనిల్‌కుమార్ రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థికసాయం అందజేసిన గడిపె అనిల్‌కుమార్‌కు అర్చన కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గడిపె ప్రభాకర్, పెంబర్తి కరుణాకర్, గడిపె మల్లేశం పాల్గొన్నారు.

### దహన సంస్కారాలకు ఎమ్మెల్యే ఆర్థికసాయం



మద్దూరు(ధూళిమిట్ట), మే14: ధూళిమిట్ట మండలం కొండాపూర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన ధూళిమిట్ట రఘుపతి దహన సంస్కారాల కోసం బుధవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులతో మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు విజయ్, మాజీ సర్పంచ్ బాదావత్ రేఖాశ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ బావు కనకయ్య, నాయకులు గడిపె వెంకటయ్య, మంద రాజు, లింగాల సంపత్, బోజ్యానాయక్, రవి, తిరుపతి, శ్రీనివాస్, సాయిలు, రాజేందర్ పాల్గొన్నారు.

### నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

మద్దూరు(ధూళిమిట్ట), మే14: మద్దూరు మండలం సలాఖపూర్‌లో నేడు(గురువారం) అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేయనున్నట్లు విగ్రహావిష్కరణ ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ చేతుల మీదుగా సాయంత్రం ఐదు గంటలకు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.